


## కనబడుటలేదు

**ఆంధ్రప్రభ** వారపత్రిక చేతులు మారాక శ్రీ వల్లూరి రాఘవరావు దాని సంపాదకుడు అయ్యారు. అతను ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధంలో ఎడిటోరియల్లో పనిచేసేప్పుడు నాకు పరిచయం. ఎడిటర్ అవగానే ప్రభ వారపత్రికకి క్రైం సీరియల్ కావాలని నన్ను కోరారు. నేను అల్లుకున్న ఓ క్రైం నవల సినాప్సిస్‌ని చెప్పాను. బావుందని, వీలైతే తేనటీగ, కల్నల్ ఏకలింగం ఎడ్వెంచర్స్‌లోలాగా రొమాంటిక్ జోక్స్‌కి అవకాశం ఉంటుందేమో చూడమని కోరారు. 2000 సంవత్సరంలో ఇంకా సీరియల్ నవలలు చదివే పాఠకులు ఉన్నారు. వాళ్ళందర్నీ ఆకర్షించాలని అతని తాపత్రయం.




ఎవరి పుస్తకాల షెల్ఫ్ కన్నా వారి టివి పెద్దదిగా ఉందో వారిని నేను పాఠకులుగా నమ్మను. బ్రెజిల్ జైళ్ళల్లో ఖైదీలకి శిక్ష తగ్గించుకునే మార్గం ఒకటుంది. వాళ్ళు జైల్లో చదివే ఒకో పుస్తకానికి నాలుగు రోజుల శిక్ష తగ్గుతుంది. అలా పుస్తకపఠనాన్ని అక్కడి ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. హైదరాబాద్‌లో ఏటా జరిపే బుక్‌ఫెయిర్ ఉత్సవం ఆరంభం అవాల్సిన సమయంలోనే రాష్ట్రప్రభుత్వం తెలుగు మహాసభలు జరుపుతూండటంతో, ప్రజలు బుక్ ఫెయిర్‌కి వెళ్ళి మహాసభలకి రారన్న భయంతో దాన్ని రద్దు చేసింది. ఇది పుస్తకపఠనానికి మన ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహం.

కనబడుటలేదు అనే ప్రకటనలు మనకి సుపరిచితమే. కనబడకుండా పోయిన వారిలో చాలామంది తర్వాత ఎప్పుడో శవాలుగా దొరికిన వార్తలు అనేకం దినపత్రికల్లో చదివాను. ఈ నేపథ్యంలో ఓ కథని అల్లుకున్నాను. ఈ నవల్లోని కొన్ని పాత్రలు ప్రధాన పాత్రలకి సంబంధం లేని పాత్రలుగా చివరిదాకా అనిపిస్తాయి. కానీ చివర్లో ప్రతీ పాత్రకి ప్రధానాంశంతో సంబంధం ఉందని

పాఠకులు గ్రహిస్తారు. నలుగురు ప్రధాన పాత్రల ఫోటోలతో 'కనబడుటలేదు' అనే పోస్టర్లని అతికించడంతో నవల ముగుస్తుంది.

ప్లాట్ విశిష్టమైంది కాదు. కానీ చిన్న పాయింట్ చుట్టూ పెద్ద కథని నైపుణ్యంగా అల్లగలిగానని ఇది రాయడానికి మునుపు చదివినప్పుడు అనిపించింది. ఆశ్చర్యంగా ఈ నవల కథ చదివే ముందు నాకు గుర్తులేదు. సగం చదివాక కాని మొత్తం గుర్తుకురాలేదు.

అప్పట్లో మొదటి పేరా లేదా మొదటి వాక్యం శ్రద్ధగా రాసేవాడ్ని. అది పాఠకుల్ని ఆకర్షిస్తే నవల్లోకి తీసుకెళ్తుంది. అలా 'కొత్తపేటలోని ఓ ఇంట్లోని ఓ అతివ పాత బియ్యాన్ని తన కొత్త ప్రియుడికి విందు చేయడానికి ఏరుతోంది' అనే వాక్యంతో ఈ నవల ఆరంభం అవుతుంది. ఆ కొత్త ప్రియుడు నాలుగురోజుల క్రితం పెరోల్ మీద విడుదలైన కలియుగం అనే నేరస్థుడు.

ఓ భార్య తన మరణానికి ముందు తనకి పుట్టిన సంతానంలో ఒకరు భర్తకి పుట్టలేదని అతనికి చెప్పి మరణించడంతో మొపాసో రాసిన ఓ కథ ప్రారంభం అవుతుంది. తన పిల్లల్ని చూసినప్పుడల్లా కథ చివరిదాకా ఆ భర్తకి వారిలో ఎవరు తన భార్యకి పరాయి పురుషుడి ద్వారా పుట్టాడు అనే ఉత్కంఠ, బాధ కలుగుతూంటుంది. ఆ ఉత్కంఠలో గొప్ప నాటకీయత ఉందని అనిపించింది. (దీన్ని కమేడియన్ రాజ్‌బాబుకి కామెడి ట్రాక్‌గా ఓ బ్లాక్ అండ్ వైట్ సినిమాలో పెట్టారు) ఆ పాయింట్‌తో ఓ కథని అల్లుకున్నాను. దాన్నే కనబడుటలేదు అనే నవలగా రాసాను.

తాగుడు వల్ల ఆరోగ్యం చెడగొట్టుకున్న రామదాసు ఇండియాలో ఉంటే లాభం లేదని దాన్నించి తప్పించుకోడానికి సౌదీ అరేబియాకి వెళ్ళాడు. అక్కడ ఉద్యోగం చేస్తూ జీవించాలి. ఇండియాలోలాగా ఆ దేశంలొ తాగే అవకాశాలన్నీ హరించుకుపోతాయి అనే ఉద్దేశంతో అతను అక్కడికి వలస వెళ్ళాడు. అతను సౌదీ అరేబియాకి వెళ్ళే విమానంలో ఉన్నప్పుడు చదవమని తన ముగ్గురు మిత్రులకి రాసిన ఉత్తరాన్ని వారిలో ఒకరైన ఏకాత్మ చదువుతాడు. దాని సారాంశం అతని ముగ్గురు స్నేహితుల భార్యల్లోని ఒకరితో రామదాసుకి అక్రమ సంబంధం ఉందని. ఐతే ఎవరి భార్యో మాత్రం చెప్పడు. అప్పుడు ఏకాత్మ, శివానంద్, చలపతి అనే ఆ ముగ్గురు మిత్రుల మనస్థితి ఎలా ఉంటుంది? తమ భార్యల పట్ల వారి చర్యలు ఎలా ఉంటాయి? ముగ్గురూ నమ్మారా? లేక ఒకరిద్దరే నమ్మారా? క్లైమాక్స్ దాకా నవల ప్రధానంగా ఈ పాయింట్ మీదే సాగుతుంది. ఇందులో ఇంకా కలియుగం అనే బేంక్ దొంగతనం ప్రయత్నం చేసే దొంగ, కొంత రుసుముకి ఫోన్‌లో సరస సంభాషణలు సాగించే రోషిణి, పరాయి స్త్రీ భర్తని ఆకట్టుకునే చమత్కారం తెలిసిన భూదేవి మొదలైన పాత్రలు ఉన్నాయి.

అప్పట్లో కొన్ని లేండ్ లైన్ నంబర్లకి ఫోన్ చేస్తే నిమిషానికి ఇంతని ఛార్జ్ చేసే సౌకర్యం ఫోన్‌లో ఉండేది. ఫోన్ సెక్స్ నంబర్లు చాలా ప్రాచుర్యంలోకి వచ్చాయి. (ఇది ఇంకా ఉందని, లీజ్డ్ లైన్స్ తీసుకుని సరస సంభాషణలు చేసే ఆడవాళ్ళని నియమిస్తున్నారని ఇటీవల దినపత్రికలోని ఓ వార్త చదివాక తెలిసింది) బేంక్‌లో పని చేసే ఏకాత్మ సహాయంతో కలియుగం బేంక్ నించి డబ్బు దొంగలించడం సబ్‌ప్లాట్ ఐనా మెయిన్ ప్లాట్‌తో చక్కగా కలిసింది. 1954లో రాయబడ్డ ఓ అమెరికన్ క్రైం కథలోని (పేరు గుర్తులేదు) రెండు పేరాలని తీసుకుని దాన్ని క్లైమేక్స్‌గా వాడుకున్నాను.

సెప్టెంబర్ ఆఖరివారం 1999లో నేను ఆధ్యాత్మిక జీవితంలోకి ప్రవేశించాను. ఫలితంగా వ్యక్తిగత విషయాల్లో చాలా నియమాలని కఠినంగా పాటించినా, నాలోని రచయితలోకి మాత్రం దాన్ని చొరబడనీయలేదు. అందువల్లే ఈ నవల్లో అక్రమ సంబంధాలు, సెక్స్‌లాంటివి అయిష్టంగానే అయినా రాయగలిగాను. క్రితం నెల పరిచయం చేసిన 'ముంగిట మృత్యువు' నవల్లోకూడా హింసని అయిష్టంగానే రాసాను. ఆ తర్వాత రాసిన చాలా నవలల్లో సెక్స్ ప్రమేయం అవసరం లేనివి లభ్యం అవడం బహుశా దైవ కృపే అనుకుంటా.

ఉగాది 2000 సంవత్సరంలో 'కనబడుట లేదు' అనే నా సీరియల్ ఆంధ్రప్రభ వారపత్రికలో ఆరంభమై 20వారాలు వెలువడింది. పుస్తకరూపంలో 176 పేజీలు వచ్చిన ఇది చిన్న నవల.

లిపి పబ్లికేషన్స్ దీన్ని పుస్తకంగా నవంబర్ 2000లో వెలువరించింది. వెల రూ.40/ మొదటి ఎడిషన్ వేగంగా అమ్ముడైంది. గత 16 ఏళ్ళల్లో మళ్ళీ పునర్ముద్రణ జరగలేదు.

Post your comments

www.anandbooks.com
www.telugubooks.in

***ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి***